క్లుప్తంగా

వెంకన్న ఆలయంలో అన్నసమారాధన



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

కాళ్ల: కాళ్లకూరు స్వయంభు శ్రీవేంకటేశ్వర స్వామి వార్షిక తిరు కల్యాణ మహోత్సవాల ముగింపు సందర్భంగా స్వామివారి దేవస్థానము నందు శనివారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించి తరించారు. దాతలు, గ్రామస్తుల సహాయ సహకారాలతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం.అరుణ్ కుమార్, సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కొనసాగుతున్న విజ్ఞాన శిబిరం



భీమవరం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు స్నాక్స్ అందజేస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని ప్రథమశ్రేణి శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతోంది. శిక్షణలో భాగంగా శనివారం మనోఉల్లాసం, వికాసానికి తగిన కృత్యాలపై శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా హైదరాబాద్‌కు చెందిన ఇంపాక్ట్ క్లబ్ ట్రైనర్ పి నాగరాజు వృత్తాలతో సబ్ కాన్షియస్ మైండ్ పెంచే కృత్యం, టీమ్ వర్క్, నూతన పదాలతో కథలు చెప్పే సృజనాత్మకతపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాధికారి ఎస్ వెంకటేశ్వరరావు విద్యార్థులతో పుస్తక పఠనం, చెస్, క్యారమ్స్‌పై శిక్షణను పర్యవేక్షించారు. నృత్య కళాకారుడు జె శ్యామ్ డ్యాన్స్‌లో శిక్షణ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు స్నాక్స్, మజ్జిక ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వి సోమరాజు, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పింఛన్ల పంపిణీ



కొత్తపాలెంలో వృద్ధురాలికి పింఛను అందిస్తున్న ఎంపీడీఓ బాబ్జిరాజు

మొగల్తూరు: ఎన్నికల కోడ్ కొనసాగుతోంది. జూన్ నెల పింఛన్లకు సంబంధించి మొగల్తూరు మండలంలోని 17 గ్రామాల్లో 3,265 మందికి శనివారం సాయంత్రానికి సుమారు 1,725 మందికి సొమ్ము అందించామని ఎంపీడీఓ వి.బాబ్జిరాజు తెలిపారు. 7,534 మందికి వారి బ్యాంక్ ఖాతాల్లో నగదు జమచేయాల్సి ఉందన్నారు. కొత్తపాలెం, శేరేపాలెం గ్రామాల్లో పింఛన్ల పంపిణీనా ఆయన పర్యవేక్షించారు. మరో రెండు రోజుల పాటు పింఛన్ల పంపిణీ కొనసాగుతుందని చెప్పారు.

దోబూచులాడుతున్న వరుణుడు

మొగల్తూరు: గత కొద్ది రోజులుగా భానుడు తనప్రతాపం చూపడంతో అల్లాడిన ప్రజలు శనివారం వేకువ జాము నుంచి ఉదయం 10 గంటలు వరకు ఆకాశంలో మబ్బులు కమ్మేయడంతో వాతావరణం చల్లబడి ఊపిరి పీల్చుకున్నారు. రానున్న రెండు రోజుల పాటు అక్కడక్కడ తేలిక పాటి వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో వర్షాలు పడితే వాతావరణం చల్లబడుతుందని ప్రజలు భావిస్తున్నారు.

ఓట్ల లెక్కింపునకు సహకరించండి

యలమంచిలి: రాజకీయ పార్టీ నాయకులంతా ఈ నెల 4న భీమవరంలో నిర్వహించే ఓట్ల లెక్కింపు సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని తహసీల్దార్ చిక్కాల వరలక్ష్మి కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆమె రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఓట్ల లెక్కింపు రోజున ఉండే నిబంధనలను వివరించారు. జూన్ 6వ తేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, కోడ్ ముగిసే వరకు ర్యాలీలు, బాణసంచా కాల్చులకు అనుమతి లేదని చెప్పారు.

ఆర్థిక పరిపుష్టి సాధించాలి

నరసాపురం: మహిళలు ఆర్థికంగా తమకాళ్లపై తాము నిలబడే విధంగా తగిన కృషి చేయాలని భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య (ఐద్వా) రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి సూచించారు. మూడురోజులపాటు జరిగే ఐద్వా రాష్ట్రస్థాయి శిక్షణా శిబిరం శనివారం స్థానిక అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న రమాదేవి మాట్లాడుతూ సమాజం ఎంతో అభివృద్ధి చెందిదని చెప్పుకోవడమే తప్ప, మహిళలు ఇంకా పురుషులతో సమానంగా బతకలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు ఉన్నత చదువులు చదువుకుని, ఆర్థిక పరిపుష్టిని సాధించాలని సూచించారు. కార్యక్రమానికి ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ అధ్యక్షత వహించగా, సావిత్రి ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి



భీమవరం (ప్రకాశం చౌక్): దాసాంజనేయస్వామిని దర్శించుకుంటున్న గ్రంధి శ్రీనివాస్



కాళ్ల: మాలవానితిప్పలో అభయాంజనేయ స్వామికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: అంజనీపుత్రుడి జయంతి ఉత్సవాలు శనివారం వైభవంగా నిర్వహించారు. రామాలయాల వద్ద, ఆంజనేయస్వామి ఆలయాల వద్ద భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తమల పాకులతో ప్రత్యేక పూజలు చేశారు. పలు చోట్ల అభిషేకాలు నిర్వహించారు. స్థానిక ఆనాల చెరువు వద్ద స్వామివారి కల్యాణోత్సవం వైభవోపేతంగా జరిగింది. పెద్దింటి అమ్మవారి ఆలయం వద్ద అభయాంజనేయస్వామి ఆలయంలో అభిషేకాలు, తమలపాకులతో పూజలు చేశారు. దత్త క్షేత్రంలో పంచముఖ ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా సామూహిక సహస్ర నాగవల్లి దళార్చన, సింధూర అర్చన నిర్వహించారు. అనంతరం అఖండ అన్నసమారాధనలు జరిగాయి.

అమ్మవార్ల వార్షిక జాతర

స్థానిక మాదివాడలోని గంగానమ్మ, మద్దిరావమ్మ అమ్మవార్ల వార్షిక మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లకు పట్టు చీరలు సమర్పించారు. పానకాలు, చలివిడి కావిడిలతో ఆలయం వద్ద భక్తులు ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

దాసాంజనేయస్వామి సన్నిధిలో...

భీమవరం (ప్రకాశంచౌక్): హనుమాన్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ శనివారం స్థానిక మారుతి సెంటర్‌లోని దాసాంజనేయ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. కాగా హనుమాన్ జయంతి సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు తగు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు తోట భోగయ్య, చెల్లబోయిన సూర్యప్రకాష్ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

కిటకిటలాడిన ఆలయాలు

కాళ్ల: హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం మండలంలోని భక్తాంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రధానంగా మాలవానితిప్ప గ్రామంలో హనుమాన్ జయంతి పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సాగిరాజు సుబ్బరాజు స్వామివారికి రూ.2 లక్షలు విలువ చేసే వెండి ఆభరణాలు బహూకరించారు. అనంతరం సాగిరాజు సుబ్బరాజు, మంతెన నాగరాజు ఆర్థిక సహకారంతో అఖండ అన్నసమారాధన, ఉద్దరాజు అచ్యుతవర్మ ఆర్థిక సహకారంతో స్వామివారికి పుష్పాలంకరణ నిర్వహించారు. కార్యక్రమంలో వేగేశ్న ఏడుకొండలరాజు, మంతెన రంగరాజు, వెంకటరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలో కాళ్ల, కోమటిగుంట తదితర గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పాలకోడేరు: హనుమజ్జయంతి సందర్భంగా పాలకోడేరు మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పంచామృతాలతో, పూలతో, పండ్ల రసాలతో స్వామివారికి అభిషేకాలు చేశారు. పెన్నాడ అమ్ములు ఆదాడ గోపి దంపతులు ఆంజనేయ స్వామికి 132 గ్రాముల వెండి తమలపాకుల దండను బహూకరించారు. పలు చోట్ల పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు.

గంధసింధూరంతో ప్రత్యేక పూజలు

వీరవాసరం: మండలంలోని పలు ఆలయాల వద్ద శనివారం హనుమద్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు వెళ్లి ఆంజనేయస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గంధసింధూరం, తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. 108 ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో మేకల వెంకట చలపతి, ముద్రగడ యేసు రాజు, అప్పారావు, కుప్పిండి శ్రీనివాసరావు, కావలి ఖుషి కేశ దామోదర్‌రావు, వడ్డీ కనకదుర్గ ప్రసాద్, పంజా చంద్రరావు రామచంద్రరావు, పంజా జానకిరామయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆకివీడు: శ్రీరాంపురంలో ఆంజనేయస్వామి విగ్రహం వద్ద పూజలు చేసిన భక్తులు



ఆకివీడు: ఆనాల చెరువు వద్ద ఆంజనేయస్వామికి లక్ష తమలపాకుల పూజ చేస్తున్న దృశ్యం



పాలకోడేరు: పెన్నాడలో వెండి తమలపాకుల అలంకరణలో భక్తాంజనేయ స్వామి

శాంతకుమారికి సత్కారం



శాంతకుమారిని సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: విద్యార్థులను క్రమశిక్షణతో ఉన్నతులుగా తీర్చిదిద్దడంతో ప్రిన్సిపాల్ బీఎస్ శాంత కుమారి చేసిన కృషి ప్రశంసనీయమని భీమవరం డీఎన్నార్ కళాశాల సెక్రటరీ గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు, ఉపాధ్యక్షుడు గోకరాజు పాండు రంగరాజు అన్నారు. పదవీ విరమణ చేసిన ప్రిన్సిపాల్ శాంతకుమారిని కళాశాల యాజమాన్యం, కళాశాల స్టాఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సత్కార కార్యక్రమంలో మాట్లాడారు. కరోనా వైరస్ సమయంలో సైతం శాంతకుమారి కళాశాల అభివృద్ధికి కృషి చేయడమేగాక ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తుకు పాటుపడ్డారన్నారు. ఈ కార్యక్రమానికి కళాశాల నూతన ప్రిన్సిపాల్ జి మోజెస్ అధ్యక్షత వహించగా కె రామకృష్ణంరాజు, కొత్తపల్లి శివరామరాజు, చిలుకూరు కుమార దత్తాత్రేయవర్మ, స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్షుడు బీవీ నర్సింహరాజు, ఎ వీరయ్య, పి హరికృష్ణం రాజు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాలి



గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

నరసాపురం: పిల్లలకు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాల్సిన అవసరం ఉందని నరసాపురం గ్రేడ్-1 గ్రంథాలయం లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి అన్నారు. గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరంలో భాగంగా శనివారం పిల్లలతో పుస్తక పఠనం చేయించారు. కథలు చెప్పడం, యోగా, లెక్కల సబ్జెక్ట్‌లో మెళుకువలు నేర్పించారు. ఈనెల 7వతేదీ వరకు శిబిరం కొనసాగుతుందని కుమారి తెలిపారు. మున్సిపల్ స్కూల్ హెచ్‌ఎం కె.వెంకటేశ్వరరావు, సుధీర్‌మోహన్, సూర్యంబాబు, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కంటి శస్త్రచికిత్సలు



కంటి శస్త్రచికిత్సలు చేయించుకున్న వారికి పండ్లు అందించిన సుధాకరరావు

పాలకొల్లు అర్బన్: పేదలకు సాయం చేయడంలో నిజమైన ఆత్మ సంతృప్తి కలుగుతుందని వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు అన్నారు. పాలకొల్లు లయన్స్ కంటి ఆసుపత్రిలో వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఆరుగురికి రూ.30వే లు ఖర్చు చేసి కంటి శస్త్ర చికిత్సలు చేయించారు. వారికి పండ్లు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, కోశాధికారి పోతుల ఉమాశంకరరావు, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, జవ్వాజి కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ

వీరవాసరం: పాఠశాలల్లో విద్యార్థులకు రుచికరమైన మధ్యాహ్న భోజనాన్ని ప్రేమతో వడ్డించాలని మధ్యాహ్న భోజన పథక జిల్లా కోఆర్డినేటర్ కృష్ణారావు తెలిపారు. వీరవాసరం మద్దాల రామకృష్ణమ్మ జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో శనివారం నిర్వహించిన మధ్యాహ్న భోజన పథక నిర్వాహకుల ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మధ్యాహ్న భోజన తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, అత్యంత పరిశుభ్రకర వాతావరణంలో విద్యార్థులకు అందించాలన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమాల్లో ఎస్ సత్యనారాయణ, ఎంఎంపీ శివన్నారాయణ, జి.చిన్నయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల వేతనాలను సత్వరమే చెల్లించాలి

సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ విజయనరసింహరాజు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు

భీమవరం అర్బన్: ఉపాధి హామీ కూలీల వేతనాలు సత్వరమే చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. భీమవరంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలువురు గ్రామ సర్పంచ్‌లు ఉపాధి హామీ వేతన బిల్లులు చెల్లించడంలేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ విజయనరసింహరాజు మాట్లాడుతూ పనులు లేక పస్తులుండకూడదనే లక్ష్యంగా 100 రోజుల పనిదినాలు కల్పిస్తున్నారన్నారు. గ్రామ పంచాయతీల పరిధిలో మురుగు బోదెలు, పంట కాలువలు, చెరువులు పూడిక తీయడం, మొక్కలు నాటడం వంటి ఎన్నో పనులు కూలీలు చేస్తున్నారన్నారు. మండలంలో 25 గ్రామాలకు గాను ప్రతి ఊరిలో ఎన్ఆర్ఈజీఎస్ పనులు జరుగుతున్నాయన్నారు. 2023-2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లక్షా 90 వేల వేతన దినాలు కల్పించగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఏప్రిల్, మే నెలల్లో తక్కువ సమయంలో లక్షా 2 వేల పనిదినాలు కల్పించారన్నారు. మండలంలో రూ.2 కోట్ల 40 లక్షలు వేతన బకాయిలు చెల్లించారన్నారు. మరో రూ.40 లక్షలు సచివాలయాల ఆధునికీకరణకు నిధులు విడుదల చేశారన్నారు. మండలంలో ఎవరికైనా వేతన బకాయిలు ఉంటే సత్వరమే చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. ముందుగా వ్యవసాయ, డ్రెయిన్, ఇరిగేషన్, వైద్య ఆరోగ్య, విద్యుత్ శాఖ, వివిధ శాఖల నుంచి అధికారులు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, ఎంపీటీసీలు తిరుమాని తులసీరావు, బొమ్మిడి కొండరాజు, కేతా నాగమణి, సర్పంచ్‌లు ఆరేటి పెద్దబ్బు, కోళ్ల బాలకృష్ణ, జల్లా కొండయ్య, చిల్లే వెంకటేష్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు బద్ధా శాంతారావు, వివిధ శాఖల అధికారులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఎన్ కళాశాలలో అచీవర్స్ డే వేడుక



విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని సీఎస్ఎన్ కళాశాలలో శనివారం అచీవర్స్ డే వేడుకను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జగదీశ్ మెరైన్స్ ఎక్స్‌పోర్ట్స్ ఎండీ తోట జగదీష్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని మంచి ఉద్యోగాన్ని సాధించినపుడు తల్లిదండ్రులు ఆనందానికి అవధులుండవన్నారు. సీఎస్ఎన్ కళాశాలకు చెందిన 104 మంది విద్యార్థులు ఉద్యోగులకు ఎంపికైన సందర్భంగా అచీవర్స్ డే నిర్వహించి వారిని అభినందించడం ప్రశంసనీయమన్నారు. కళాశాల కార్యదర్శి డాక్టర్ చీడే సత్యనారాయణ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు మంచి కంపెనీల్లో ఉద్యోగాలు సాధించడం ఆనందదాయకమన్నారు. అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సకుమళ్ళ సత్యనారాయణ, కళాశాల కోశాధికారి వడుపు గోపీ, స్టార్టెక్ కంపెనీ సీఈఓ వేణుగోపాల్, సలీం ఖాన్, నిర్మల, బొమ్మదేవర ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



పెదగరువులో శ్రీఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: హనుమద్ జయంతిని పురస్కరించుకుని శనివారం భీమవరం మండలంలోని పెదగరువులో వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల సహకారంతో శ్రీఆంజనేయస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం గ్రామస్తులకు శుభసూచకమన్నారు. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలన్నారు. శ్రీఆంజనేయస్వామి వారిని దర్శించుకున్న వారిలో ఎంపీటీసీలు తిరుమాని తులసీరావు, కేతా నాగమణి, బొమ్మిడి కొండరాజు ఉన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు పేరిచర్ల సత్యనారాయణమ్మ, శివరామరాజు, సాయిరాజు, భరత్, కలిదిండి వాసు, దాట్ల శ్రీనివాసరాజు, అల్లూరి సూరపరాజు, కూనపురాజు అప్పలరాజు, కలిదిండి రంగరాజు, కూనపు రాజు, బలరామరాజు, పెన్మెత్స వెంకటరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా జయంతి ఉత్సవాలు

మండలంలోని పలు గ్రామాల్లో శనివారం హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయాల వద్ద శ్రీ ఆంజనేయస్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆంజనేయస్వామి నామ స్మరణతో గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది.

రోడ్లపైకి పశువులను వదిలితే చర్యలు

నరసాపురం: రోడ్లపైకి పశువులను వదిలితే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. స్థానిక మార్కెట్ ప్రాంతంలో పశువులు విచ్చలవిడిగా సంచరించడంతో ట్రాఫిక్ ఇబ్బందులు, ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. యజమానులు తమ పశువులను కట్టడి చేసుకోవాలని మైక్ ప్రచారం చేశామన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



ఉండి: ఉండి సెంటర్‌లో పరిశీలన చేస్తున్న అడిషనల్ డీఎస్పీ, రైల్వే డీఎస్పీ



ఆకివీడు: మాదివాడలో కౌంటింగ్ ఫలితాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్సైలు

ఉండి: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని అడిషనల్ డీఎస్పీ బాషా, రైల్వే డీఎస్పీ నాగేశ్వరరావు అన్నారు. ఈ నెల 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్‌ను పురస్కరించుకుని ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా శనివారం ఉండి సెంటర్‌ను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఉండి నియోజకవర్గంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా మంచి సహకారాన్ని అందించారని, అలాగే ఓట్ల లెక్కింపును తరువాత వెలువడే ఫలితాలను కూడా అంతే హుందాగా తీసుకుని వ్యవహరించాలన్నారు. ఎక్కడా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించవద్దని సూచించారు. ఎవరైనా విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే వారిపై ఎన్నికల నియమావళిని అనుసరించి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అలాగే రౌడీ షీటర్ల కదలికలపైనా ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని సూచించారు. అలాగే సమస్యాత్మక గ్రామాల్లో నిఘా పెంచాలని తెలిపారు. ఏ పార్టీ విజయం సాధించినా విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని, ఎవరి ఇంట్లో వారే సంతోషంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉండి ఎస్సై ఎం లక్ష్మణ్ తదితర పోలీసులు పాల్గొన్నారు.

ప్రజలు స్నేహభావంతో మెలగాలి

ఆకివీడు: ఎన్నికల ఫలితాలపై అతిగా స్పందించడం మంచిది కాదని, ప్రజలు ఆవేశాలకు గురికావద్దని ఆకివీడు రూరల్ సీఐ సత్యనారాయణ, ఎస్సై బీ నాగబాబు సూచించారు. స్థానిక మాదివాడలో పలు చోట్ల శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫలితాల్లో ఎవరు విజయం సాధించినా, ఓటమిపాలైనా ప్రజలు ఓర్పు సహనంతో ఉండాలన్నారు. మీరు వేసిన ఓట్లతోనే గెలుపోటములుంటాయని వివరించారు. ఎన్నికలు పూర్తయినందున ప్రజలు స్నేహభావంతో మెలగాలని పిలుపునిచ్చారు.

గోప్యత, క్రమశిక్షణ పాటించాలి

పెనుగొండ: సార్వత్రిక ఎన్నికల ఓట్లు కౌంటింగ్ కేంద్రాల్లో ప్రతి ఒక్కరూ గోప్యత, క్రమశిక్షణ పాటించాలని ఆచంట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.స్వామి నాయుడు అన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ అనుమతి లేదన్నారు. లెక్కింపు ప్రారంభానికి ముందు ఆర్‌పీ సెక్షన్ 128లోని నిబంధనలు చదివి వివరిస్తామన్నారు. చట్టం 1951 రూల్ 54 ఎన్నికల నియమాలు, 1961 ప్రవర్తన, హాజరైన వారికి సమాచారం కోసం, వారి భాగస్వామ్యానికి సంబంధించి గోప్యత నిర్వహణకు పూర్తి వివరాలు అందిస్తామని తెలిపారు. కౌంటింగ్ వద్ద ఉన్న ప్రతి వ్యక్తీ చట్టం ప్రకారం నిర్వహించాల్సిన విధులు, బాధ్యతలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఆచంట నియోజకవర్గ కౌంటింగ్ భీమవరం బి సీతా పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 4వ తేదీన నిర్వహిస్తామని తెలిపారు. కౌంటింగ్ సిబ్బందికి, ఏజెంట్స్‌కు బస్సులు ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. విష్ణు కళాశాల గేటు వరకు తీసుకొస్తారని తెలిపారు. కౌంటింగ్ సైపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లకు గుర్తింపు కార్డులు జారీ చేయనున్నట్లు చెప్పారు. 1962 ప్రవర్తనా నియమావళిని అనుసరించి కౌంటింగ్ ఏజెంట్లను నియమిస్తామన్నారు. ధ్రువీకరణ పత్రం, గుర్తింపు కార్డు సమర్పించిన తరువాత కౌంటింగ్ ఏజెంట్స్ డిక్లరేషన్‌పై రిటర్నింగ్ అధికారి ఎదుట సంతకం చేయాల్సుంటుందని తెలిపారు. ఒక్కో టేబుల్‌కు ఒక్కో ఏజెంటును మాత్రమే అనుమతిస్తామన్నారు. కౌంటింగ్ కేంద్రం మొత్తం తిరగడానికి అవకాశం లేదన్నారు. రిటర్నింగ్ అధికారి టేబుల్ వద్ద ఉన్న అభ్యర్థి వద్ద ఎలక్షన్ ఏజెంట్‌కు మాత్రమే అవకాశం ఉంటుందని తెలిపారు. వరుసగా ఏర్పాటు చేసిన టేబుల్స్ పైన పోలింగ్ కేంద్రాల వివరాల పట్టికలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రాధాన్యత అనుగుణంగా సిట్టింగ్ ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు.